క్లుప్తంగా

'ఇంటిదొంగల చేతివాటం'

ములకలపల్లి: మండల పరిధిలోని మాధారంలో కొంతమంది వ్యక్తులు స్థానిక అటవీ అభివృద్ధి కార్పొరేషన్ అధికారులతో కలిసి అక్రమంగా జామాయిల్ నరికి విక్రయిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు నరాటి ప్రసాద్ ఆరోపించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఆయన విరుచుకుపడ్డారు. మాధారం పరిధిలో గురువారం జామాయిల్ నరుకుతుండగా.. కార్పొరేషన్ ఉన్నతాధికారులు దాడి చేశారని, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. తమ కార్పొరేషన్ అధికారులకు సంబంధం ఉండడంతోనే ఈ విషయాన్ని బయటికి పొక్కకుండా గోప్యంగా ఉంచారని అనుమానం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి, సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

నులిపురుగుల దినోత్సవంపై సమావేశం



సన్నాహక సమావేశంలో పాల్గొన్న అధికారులు

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): ఈ నెల 11న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు వేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీఓ మహాలక్ష్మి, డాక్టర్ ప్రియాంక, డిప్యూటీ తహసీల్దార్ జగదీశ్వరి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బ్లీచింగ్ చేయించాలి

మణుగూరుటౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయని, వెంటనే కార్మిక వాడల్లో బ్లీచింగ్ చేపించి జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు చేపట్టాలని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ డిమాండ్ చేశారు. గురువారం ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం వల్ల దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, డయేరియా, ఫైలేరియా వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని, వాడల్లో ఎప్పటికప్పుడు అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరారు.

వైద్య శిబిరం ఏర్పాటు

పినపాక: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులను దూరం చేసుకోవచ్చని పినపాక ప్రభుత్వ వైద్యులు అనిల్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని వలస గొత్తికోయ గ్రామం చింతలపాడులో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆదివాసీలకు ఆహారం, శుభ్రత, వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

ములకలపల్లి: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండలపరిధిలోని పొగళ్లపల్లి సెక్టార్ పరిధి రాజుపేట శివారు రైతువేదికలో కార్యక్రమం ఏర్పాటు చేయగా.. దమ్మపేట సీడీపీఓ హేమసత్య పాల్గొని తల్లిపాల అవశ్యకతను వివరించారు. సామూహిక సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. ఎంపీడీఓ సత్యనారాయణ, సూపర్‌వైజర్ జ్ఞానసుందరి, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ములకలపల్లి: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ న్యాయవాది గిరెె సంపత్ అన్నారు. గుడ్ షపర్డ్ సిస్టర్ ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గురువారం ములకలపల్లి కార్యక్రమం ఏర్పాటు చేసి, మాట్లాడారు. సిస్టర్స్ దీప్తి, ఉదయం, రాజ్యం, సిబ్బంది సాగర్, సుజాత, సందీప్, బాలు పాల్గొన్నారు.

ప్రారంభించకుండానే పనిచేయని బోరు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పాతిరెడ్డిగూడెం గ్రామంలో తాగునీటి అవసరాల కోసం గడిచిన వేసవి కాలంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో హ్యాండ్ బోరు వేశారు. ఈ చేతి పంపు ఏర్పాటుకు దాదాపు రూ.2లక్షల వరకు ఖర్చు చేయగా.. ప్రారంభించకుండానే పని చేయకుండా పోయింది. లక్షలు ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన బోరు ఒక్క రోజు కుడా పని చేయకపోవడం ఆ శాఖ అధికారుల పనితీరుకు నిదర్శనంగా చెప్పవచ్చు. కొండరెడ్డి గ్రామంలో గ్రామస్తుల అవసరాల కోసం దీన్ని నిర్మించగా.. పని చేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి చేతిపంపుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సతీష్‌ను వివరణ కోరగా.. కొత్తగా వేసిన బోరు పని చేయడం లేదని, మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

ఏజెన్సీలో రాఖీ సందడి

- పలుచోట్ల స్టాళ్ల ఏర్పాటు
- విక్రయానికి విభిన్న రాఖీలు
- ప్రారంభమైన కొనుగోళ్ల హడావుడి





భద్రాచలంలో ఏర్పాటు చేసిన రాఖీ స్టాళ్లు, (ఇన్‌సెట్) విభిన్న రకాల రాఖీలు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీలో రక్షాబంధన్ పండుగ సందడి మొదలైంది. మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో సైతం రాఖీ స్టాళ్లను ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు.

రక్షాబంధన్ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక. రాఖీ పండుగను ప్రతి ఏటా శ్రావణ పౌర్ణమి రోజున అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి మురిసిపోతారు. సోదరుడు దీర్ఘాయుష్షుతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ.. తమ అనురాగాన్ని వ్యక్తపరుస్తారు. జీవితాంతం సోదరీమణులకు రక్షగా నిలవాలని సోదరులు భావిస్తారు. ఇటువంటి రాఖీ పౌర్ణమి ఈ నెల 9న రాఖీ రాగా.. మార్కెట్‌లో వివిధ రకాల రాఖీలను విక్రయదారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. సోదరీమణులు కొనుగోలు చేసేందుకు రాఖీ స్టాల్స్‌కు క్యూ కడుతున్నారు.

పట్టణంలో ప్రత్యేక స్టాళ్లు..

భద్రాచలం పట్టణంలో ప్రధాన సెంటర్లతో పాటు పలుచోట్ల రాఖీల విక్రయాలకు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ రాఖీల ధరలు రూ.10 నుంచి రూ.600 వరకు అందుబాటులో ఉన్నాయి. మార్కెట్లో డిమాండ్‌ను అనుసరించి వ్యాపారులు పలు భిన్నమైన రాఖీలను అందుబాటులో ఉంచారు. చుట్టు ప్రక్కల గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు రాఖీల కొనుగోలుకు తరలి వస్తుండడంతో రాఖీ స్టాళ్ల వద్ద సందడి వాతావరణం కనిపిస్తోంది.

ఆకట్టుకుంటున్న డిజైన్లు..

మారుతున్న కాలంతో పాటు రాఖీలు సైతం పలు విభిన్నమైన డిజైన్లలో ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా యువతులను ఆకర్షించే విధంగా జైపూర్ స్టోన్ రాఖీలు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు ముత్యాలు, రుద్రాక్ష, తక్కువ నాణ్యత గల వజ్రాలు పొదిగిన రాఖీలు, బంగారు పూత రాఖీలు, తమలపాకు రాఖీలు ఉన్నాయి. చిన్న పిల్లలను ఆకట్టుకునేలా నెమలి ఈకెల రాఖీలతో పాటు చోటా భీమ్, మిక్కీ మౌస్, యాంగ్రీ బర్డ్ వంటి బొమ్మలతో కూడిన రాఖీలు సైతం వ్యాపారులు విక్రయానికి ఉంచారు.

ముందస్తు వేడుకలు..



విద్యార్థులకు రాఖీ కడుతున్న విద్యార్థినులు

మణుగూరురూరల్: మండలంలోని కూనవరం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు విద్యార్థుల చేతికి రాఖీలను కట్టారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ మీరాహుస్సేన్ మాట్లాడుతూ.. విద్యార్థినీ, విద్యార్థులు సోదర సోదరీమణుల్లాగా కలిసి మెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సారయ్య, సరిత, రఘుమోహన్‌రావు, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

పేటలోనూ అదే సందడి..

అశ్వారావుపేటరూరల్: అక్కా తమ్ముళ్ల అనురాగానికి, అన్నా చెల్లెల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే 'రక్షా బంధన్'కు రాఖీలను విక్రయించేందుకు ప్రత్యేకంగా దుకాణాలు వెలిశాయి. మండలంలోని ఊట్లపల్లి, వినాయకపురం, నారాయణపురం గ్రామాలతోపాటు అశ్వారావుపేటలో ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, భద్రాచలం రోడ్‌లో పలువురు వ్యాపారులు రాఖీల విక్రయాలకు షాపులు పెట్టారు. దీంతో గురువారం నుంచే ఆయా దుకాణాల వద్ద స్థానికులు రాఖీలు కొనుగోలు చేసేందుకు రాగా.. దుకాణాల వద్ద సందడి నెలకొంది. కాగా, కొత్త, కొత్త రకాలతోపాటు, ట్రెండ్‌కు తగ్గట్లు రాఖీలు అందుబాటులో ఉండటంతో వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు.



రాఖీలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

పర్ణశాల ఆలయంలో పవిత్రోత్సవాలు



ప్రధాన ఆలయం నుంచి వచ్చిన పవిత్రాలకు స్వాగతం పలుకుతున్న ఆలయ సిబ్బంది

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాల సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం సంప్రదాయబద్ధంగా పవిత్రాలను స్వామి వారికి సమర్పించారు. ప్రతీ ఏడాది శ్రావణమాసంలో పవిత్రోత్సవాలను 5రోజుల పాటు నిర్వహిస్తారు. దీనిలో భాగంగా భద్రాచల ఆలయ ఉప ప్రధాన అర్చకులు అమరవాది మురళీకృష్ణమాచార్యులు, అమరవాది శ్రీనివాస రామానుజన్, అర్చకులు పవన్ కుమార్ ఆధ్వర్యంలో ముందుగా ప్రధాన ఆలయంలోని మూలమూర్తులకు, తదుపరి ఉత్సవ మూర్తులకు సదరు పవిత్ర మాలలను సమర్పణ చేశారు. అనంతరం ఉపాలయాలైన ఆంజనేయ స్వామి, లక్ష్మీ నారాయణ స్వామి, వేణుగోపాల స్వామి వార్లకు, ఆలయ ధ్వజస్తంభానికి, సుదర్శన పెరుమాళ్‌కు ఘనంగా పవిత్రమాలను సమర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్, ఆలయ అర్చకులు భార్గవాచార్యులు, నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు స్పందన కరువు

అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు స్పందన కరువైంది. గురువారంతో ప్రవేశాల గడువు ముగిశాయి. అయితే కళాశాలలో నాలుగు గ్రూప్‌లకు గాను 60 చొప్పున 240 సీట్లు ఉండగా, కేవలం 16 మంది విద్యార్థులే ప్రవేశాలకు నమోదు చేసుకున్నారు. దీంతో 224 సీట్లు ఖాళీగానే మిగిలిపోయాయి.

బీఏలో 11మంది, బీకాంలో నలుగురు, బీఎస్సీ(లైఫ్ సైన్సెస్)లో ఒకరు చేరగా.. బీఎస్సీ (ఫిజికల్ సైన్స్)లో ఎవరూ చేరలేదు.

సౌకర్యాల లేమి.. సిబ్బంది కొరత

అశ్వారావుపేటకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను 2023–24లో బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే, ఉత్తర్వులు వచ్చేవరకే ప్రవేశాలు ముగియడంతో తొలి ఏడాది విద్యార్థులు చేరలేదు. ఇక 2024–25 విద్యాసంవత్సరంలో 11 మంది చేరగా.. ఇప్పుడు 16 మందే నమోదు చేసుకున్నారు. డిగ్రీ కళాశాలకు ప్రత్యేక భవనం లేక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించడం.. పూర్తిస్థాయి ప్రిన్సిపాల్, బోధన, బోధనేతర సిబ్బంది లేపోవడం ఇందుకు కారణంగా తెలుస్తోంది.

ర్యాపిడ్ ఫీవర్ సర్వే



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మణుగూరురూరల్: మండల పరిధిలోని వలస ఆదివాసీ గ్రామమైన విప్పలగుంపులో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. వైద్యసిబ్బంది గ్రామంలోని ఇంటింటినీ సందర్శించి పరిసరాలను పరిశీలించారు. జ్వరంతో బాధపడుతున్న అనుమానితుల రక్తనమూనాలను సేకరించారు. అనంతరం వైద్యశిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, కౌలస్య, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాభారతి, పద్మ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఈఈయూ నూతన కమిటీ ఎన్నిక

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్ తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. డివిజన్ ప్రెసిడెంట్‌గా సర్వేశ్వరరావును, సెక్రెటరీ అహ్మద్, ట్రెజరర్‌గా అశోక్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్–కంపెనీ వైస్ ప్రెసిడెంట్‌గా త్రినాథ్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏడుకొండలు, వైస్ ప్రెసిడెంట్‌గా వెంకటయ్యలను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా నాగరాజు, సందీప్, సాగర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ యుగంధర్, ప్రవీణ్, నరసింహారావు, లేడీ రిప్రజెంటీవ్‌గా రామలక్ష్మి, ఆఫీస్ సెక్రటరీగా రవి, హానర్ అడ్వైజర్‌గా విష్ణుమూర్తిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాశ్వత న్యాయమూర్తిని నియమించాలి



ఎమ్మెల్యే తెల్లంకు వినతిపత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

భద్రాచలంటౌన్: భద్రాచలం సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ (మొబైల్ కోర్టు)కు శాశ్వత న్యాయమూర్తి నియామకానికి చర్యలు తీసుకోవాలని భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం ఆధ్వర్యంలో న్యాయవాదులు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవదానం మాట్లాడుతూ.. ఏజెన్సీలోని 28 మండలాలకు సత్వర సివిల్ న్యాయం అందించేందుకు శాశ్వత న్యాయమూర్తిని నియమించాలని తెలిపారు. సహాయ ప్రభుత్వ న్యాయవాది పోస్టు, ఎల్టీఆర్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. భద్రాచలం మొబైల్ కోర్టు దవాలాను రూ.5 వేల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని విన్నవించారు. ఎమ్మెల్యే వెంకట్రావ్ సానుకూలంగా స్పందించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కొడాలి శ్రీనివాసన్, చీమల నరసింహారావు, ఉలవల సురేష్, బూర రామకృష్ణ, కొర్స నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా పోలీసుల తనిఖీలు



సారపాకలో తనిఖీలు నిర్వహిస్తున్న నార్కోటిక్ పోలీసులు

బూర్గంపాడు: నిషేధిత గంజాయి రవాణా, అమ్మకాలపై గురువారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. సారపాకలోని గాంధీనగర్, రాజీవ్‌నగర్, భాస్కర్‌నగర్, విజయ్‌నగర్ ప్రాంతాల్లో ఎస్ఐ నాగభిక్షం ఆధ్వర్యంలో నార్కోటిక్ పోలీసులు తనిఖీలు చేశారు. నార్కోటిక్ డాగ్‌ను రంగంలోకి దించి సోదాలు నిర్వహించారు. అనుమానితులను విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ నాగభిక్షం తెలిపారు.

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

మణుగూరురూరల్: ఈ నెల 9వ తేదీన నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం కరపత్రాలను ఆవిష్కరించి అధికారులకు అందజేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ నాయకులు మాట్లాడారు. నాయకులు అల్లెం కోటి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ పాల్గొన్నారు.

ములకలపల్లి: ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సేన రాష్ట్ర నాయకుడు, ప్రముఖ న్యాయవాది ఊకే రవి పిలుపునిచ్చారు. సోడే శ్రీను అధ్యక్షతన గురువారం ములకలపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఆదివాసీ దినోత్సవానికి భారీగా తరలిరావాలని కోరారు.

సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా..

కరకగూడెం: ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రేపు మండలంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ జేఏసీ మండల ప్రధాన కార్యదర్శి కలం సాంబమూర్తి పేర్కొన్నారు. గురువారం ఆయన మండలంలోని భట్టుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వీరాపురం క్రాస్ వద్ద ఉన్న కొమురం భీమ్ విగ్రహం వద్ద వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షించి మాట్లాడారు. నాయకులు చందా రామకృష్ణ, కలం సంపత్, పాయం ప్రభాకర్, పోలెబోయిన ప్రభాకర్, సాంబ, పాయం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



మణుగూరురూరల్: కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తున్న తుడుందెబ్బ నాయకులు

మెడికల్ బోర్డును రద్దు చేయాలి

మణుగూరుటౌన్: జూలై 31న జరిగిన మెడికల్ బోర్డులో కార్మిక లోకానికి తీవ్ర అన్యాయం జరిగిందని, ఆ బోర్డును రద్దు చేసి తిరిగి ఏర్పాటు చేయాలని ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కృష్ణంరాజు అన్నారు. గురువారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో పీకేఓసీ మెనేజర్‌కు పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్‌ఫిట్ అయిన మైనింగ్ స్టాఫ్, ట్రేడ్‌మెన్, ఈపీ ఆపరేటర్లకు సూటబుల్ జాబ్ ఇవ్వాలన్నారు. పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మాఫీ చేయాలని, నూతన గనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పలు ఇతర సమస్యలను వినతిపత్రంలో ప్రస్తావిస్తూ.. పరిష్కరించాలని కోరారు. నాయకులు కృష్ణ, గట్టయ్యయాదవ్, అబ్దుల్ రవూఫ్, రామారావు, జీవరత్నం, శ్రీను, మల్లికార్జున్, మల్లేశ్ యాదవ్, అనిల్ యాదవ్, దశరథ్, అఖిలాష్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుస్థిర వ్యవసాయంపై అవగాహన

దుమ్ముగూడెం: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఎంఎస్‌కే బంగారు భవిష్యత్తు వారి ఆర్థిక సహకారంతో మైరాడ స్వచ్ఛంద సంస్థ సుస్థిర వ్యవసాయం, అంతర్ పంటలపై గురువారం అవగాహన కల్పించింది. తక్కువ ఖర్చు ఎక్కువ దిగుబడి వచ్చేలా పంటలు పండించాలని, ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేయాలని ఏఈఓ సాహిత్య రైతులకు వివరించారు. మైరాడ కమ్యూనిటీ ఆర్గనైజర్స్ రాజు, శాంతి.. అంతర పంటలపై అవగాహన కల్పిస్తూ.. అంతర్ పంటలు వేసుకోవడం వల్ల రైతులు అభివృద్ధి చెందవచ్చని తెలిపారు. ఏబీసీ లీడర్ అప్పా రాజు, కోర్స ధర్మరాజు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయాల్లో పూజలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం, అశ్వారావుపేటలో ఉన్న సాయిబాబా ఆలయాల్లో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని బాబాను దర్శించుకున్నారు. అలాగే అభిషేకాలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మధ్యాహ్న సమయంలో భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు.

అన్నదానం..

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ సాయినగర్‌లో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, పగిడిశెట్టి హనుమంతరావు–పద్మావతి.. వారి కుమారుడు చైతన్య–నవ్య, కొక్కుల సాయి కృష్ణ–లీల శరణ్య.. వారి కుమారుడు వేద ఆర్యన్, సయ్యద్ ఇమ్రాన్–నిఖిత పర్మిల, ఇమ్రాన్ అలీ–ఆఫియ సారాలు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం అన్నదాతలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్.బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.



మణుగూరురూరల్: అన్నదానంలో పాల్గొన్న భక్తులు

దూరమవుతున్న విజ్ఞానం

- పక్కా భవనం లేక మూతబడిన గ్రంథాలయం
- ఏజెన్సీ నిరుద్యోగులకు తీవ్ర ఇబ్బందులు
- పోటీ పరీక్షలకు స్వస్తి



గతంలో గ్రంథాలయం కొనసాగిన అటవీశాఖ భవనం

గుండాల: తరతరాల విజ్ఞాన సంపదను అందించే గ్రంథాలయాలు మారుమూల పల్లెల్లో దూరమవుతున్నాయి. ఓ పక్క సాంకేతిక పరిజ్ఞానం దూసుకెళ్తున్నప్పటికీ విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలకు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. ఏళ్ల తరబడి మండల కేంద్రంలో గ్రంథాలయానికి పక్కా భవనం లేక పుస్తకాలు, విద్యా, ఉద్యోగ సోపానాలు అందని ద్రాక్షలా మారాయి.

పదేళ్లుగా ఇదే దుస్థితి..

2000వ సంవత్సరంలో మండల కేంద్రంలో గ్రంథాలయాన్ని స్థాపించారు. కాగా పక్కా భవనం లేక పదేళ్లపాటు అద్దె గదుల్లోనే కొనసాగించారు. ఆ తర్వాత స్థానిక గ్రామపంచాయతీ భవనంలో, అటవీశాఖ సిబ్బంది క్వార్టర్స్‌లో నడిపించారు. ఆ తర్వాత పదేళ్ల నుంచి అసలు గ్రంథాలయమే లేకుండా పోయింది. గ్రంథాలయాలు మనిషిని మనిషిగా మారుస్తాయని, దేశాభివృద్ధికి, సమాజ వికాసానికి గ్రంథలయాలు మూలస్తంభాలని నీతులు వల్లించే అధికారులు, ప్రజాప్రతినిధులు మారుమూల గ్రామాల్లో మంచి గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేయడం లేదు. దీంతో పోటీ పరీక్షలకు, ఉద్యోగ పరీక్షలకు, చదువుకు కావాల్సిన పాఠ్యపుస్తకాలు, క్విజ్ పుస్తకాలు దొరకని పరిస్థితి నెలకొంది. అటు పాలకులు గానీ, ఇటు స్వచ్ఛంద సంస్థలు గానీ ముందుకు రాకపోవడంతో మండల కేంద్రంలో గ్రంథాలయం ఊసే లేకుండా పోయింది.

పట్టణాల్లో కోచింగ్..

ఏజెన్సీ మండలం నుంచి నిరుద్యోగ యువత పోటీ పరీక్షలు రాసేందుకు పట్టణాల్లో రూములు అద్దెకు తీసుకుని రూ.వేలల్లో ఖర్చు పెడుతూ శిక్షణ తీసుకుంటున్నారు. స్తోమత లేని వారు వ్యవసాయ కూలీలుగా మారుతున్నారు.

ఇక్కడ గ్రంథాలయం ఉన్నట్లయితే ఎంతోకొంత విజ్ఞానం అందుతుందని వాపోతున్నారు. చదువులు పూర్తి చేసుకుని పోటీ నోటిఫికేషన్‌లు వస్తే ఈ ప్రాంతం నుంచి వందల సంఖ్యలో ఉద్యోగులుగా మారే అవకాశాలున్నాయి.

అధికారుల నిర్లక్ష్యం

గ్రంథాలయానికి మండల కేంద్రంలో పక్కా భవనం నిర్మించేందకు నిధులు మంజూరు అయినప్పటికీ అధికారులు స్థలాన్ని చూపించడంలో అశ్రద్ధ చూపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు శ్రద్ధ వహించి గ్రంథాలయానికి పక్కా భవనంతో పాటు, కనీస సౌకర్యాలు కల్పించాల్సి ఉంది.

గ్రంథాలయం ఏర్పాటు చేయాలి



ఇప్పటికే ఉన్నత చదువుల కోసం పట్టణాలలో ఉన్నాం. ఎంతో డబ్బులు ఖర్చుచేశాం. పోటీ పరీక్షల కోసం శిక్షణ తీసుకోవాలంటే స్థోమత లేదు. ఇక్కడే గ్రంథాలయం ఉంటే ఎంతో కొంత నేర్చుకుంటాం. అధికారులు చొరవ తీసుకోవాలని లేదంటే తాము వ్యవసాయ కూలీలుగా మారాక తప్పదు.

– ఎట్టి సుందర్, నిరుద్యోగి

ఆన్‌లైన్ ద్వారా చదువుతున్నా..



ఈ మండలంలో కోచింగ్ సెంటర్లు లేవు. పట్టణాలలో ఉంటూ తీసుకోలేని పరిస్థితి. ఆన్‌లైన్ ద్వారా వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాం. ఇక్కడ నెట్‌వర్క్ సమస్య తీవ్రంగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు గ్రంథాలయం ఏర్పాటు చేయాలి.

– వజ్జా ఎర్రయ్య, నిరుద్యోగి